

# నీతి

కె. రామలక్ష్మి

"బాగా భారంగా వున్నావు చెల్లెల్ని పిలిపించుకోకూడదు. సాయం చేస్తుంది.' రోజూ లంచ్ అవర్‌లో అందరూ ఇదే సలహా యిస్తున్నారు సుగుణకి.

'నిజమే ఏడో నెల. ఇప్పటి నుంచీ సెలవు పెట్టేస్తే పురిటి తరవాత కొన్నాళ్ళుండడానికి వుండదు' అని ఆలోచించింది సుగుణ కూడా.

ఓ రోజు తండ్రికి ఉత్తరం రాసింది వివరంగా. పురిటికి పుట్టింటికి వెళ్ళి వారిపై యీ ఖర్చంతా పడేయడం యిష్టంలేదు సుగుణకి. తండ్రి ఎంతో కష్టం మీద పెళ్ళి చేశాడు. ఏదో టీచర్‌గా ఉద్యోగం చేస్తోంది. చీటికీ మాటికీ పుట్టింటి మీద పడకూడదన్న నిర్ణయం చేసుకుంది సుగుణ. మధ్యతరగతి భేషజాలకి స్వస్తి చెప్పి- వున్నదాంట్లో సుఖంగా ఎలా బ్రతకడమో ప్రయత్నిస్తూ కాలం గడుపుతూన్న సుగుణకి యీ గర్భం- యిష్టం లేనిదే "నీకేం. నీఅందంతగ్గిపోతుందనిపిల్లలొద్దంటున్నావు. నన్ను మగవాడు కాదనుకుంటావు" అంటూ విసుక్కోవడం ప్రారంభించాడు— సుగుణ మొగుడు. సుగుణ మొగుడు సుందరం పేరుకి తగ్గట్టు — లడ్డులా అందంగా వుంటాడు. ఎండలో పడిపోతే అలసిపోతాననుకుంటాడు. రంగు తగ్గిపోతాననుకుంటాడు. ముఖం మీద ఓ పొక్కు వచ్చినా ఆడపిల్ల కంటే ఎక్కువ బాధపడిపోతాడు.

పెళ్ళయిన కొత్తలో భర్త అందానికి మురిసిపోయిందనే చెప్పాలి సుగుణ.

చామన చాయగా కళగా వుండే సుగుణకి సుందరం మన్మధుడిలాగా అనిపించాడు. అతని అడుగులకి మడుగులు వత్తడమే-తనకి ముక్తి మార్గంగా అనిపించేది. కాని యీ అందం వెనుక చాలా చౌకబారు మన స్తత్వం వుందని రానురాను గ్రహించింది సుగుణ.

"రోజూ రిక్షా ఎందుకు? కాస్త పెందరాళే బయలుదేరి పోవచ్చుగా అలాగే సాయంత్రం కబుర్లు చెప్పుకుంటూ నడిచి వచ్చేయచ్చు" అన్నాడొకరోజు. "మనిద్దరమేగా. అంత అదా చేయక్కరలేదు లెండి" అంది నవ్వేస్తూ

కాని సుందరం సీరియస్‌గానే అన్నాడని తరవాత గ్రహించింది. తను సంపాదించుకుంటున్నా కర్చు పెట్టుకోవడం అంటే అసహ్యం వేసేలా చేశాడు సుందరం. దాంతో వాడుక రిక్షా మానేసింది.

పెళ్ళయి సరిగ్గా ఏడాది. తన అవసరం. అందుకే డాక్టరమ్మ సలహా ప్రకారం మాత్రలు వేసుకుంటూ తనని తను రక్షించుకుంటూ వచ్చింది సుగుణ. కాని తన పురుషత్వాన్ని శంకిస్తారన్న భర్తగోల సాధింపు-మాత్రలు మానింది. 'కావలసిన ఒకటో అరో కానీ! ఫుల్‌స్టాప్ పెడతాను' అని ధైర్యం చెప్పుకుంది.

తండ్రిని ఒప్పించి చెల్లెల్ని సాయానికి పిలిపించుకుంది రోజూ వంటలో సాయం చేస్తూ అక్కగారికి చేదోడు వాదోడుగావుంది సుగుణ చెల్లెలు. పదిహేడు అప్పుడే నిండిన సుమతి. సుమతి చలాకీగా వుంటుంది. 'బావా బావా' అంటూ సుందరాన్ని వేధిస్తూ వుంటుంది. ఇంట్లో కాస్త నవ్వుల శబ్దం వినబడుతూంది.

సుగుణకి చెల్లెలు సరదాగా వుండడం సంతోషంగా వుంది. 'ఏదో పురుడు అయ్యే దాకా అటూ యిటూ తిరగడానికి తోడు' అని తృప్తిగా స్కూలుకి వెళ్ళి వస్తూంది.

నెలలు గడుస్తున్నాయి. సుగుణకి మరీ భారంగా అనిపిస్తూంది. కాని ఎలాగో పురిటికి ముందో వారంరోజులదాకా యిలా స్కూలుకి వెళ్ళి వస్తుంటే సరి-అని గడుపుకు వస్తూంది రోజులు.

సుమతి ఉదయం వంటచేస్తుంది. అక్కకి టిఫిన్ కట్టియిస్తూంది. బావగారికి టిఫిన్ పెట్టూంది. ఆరోజే చూసింది. భర్త మధ్యాహ్నం భోజనం తీసుకెళ్ళడంలేదని.

"ఎలాగా సుమతి ఒక్కర్తీ తినాలి-వచ్చి తినిపోతున్నాను" అన్నాడు భార్య ముఖంలోకి చూస్తూ.

"మరి ఎండ?" రంగు తగ్గిపోతానేమోనని భయపడే భర్త మధ్యాహ్నం ఎండలో ఇంటికి రావడం ఆశ్చర్యంగా వుంది సుగుణకి.

"ఎందేమిటిలే- పాపం సుమతి... పని మనిషి కాదుగా" అన్నాడు.

మరేం మాట్లాడలేదు సుగుణ. ఆ రోజుతో నెలలు నిండాయనే చెప్పవచ్చు ఇక పురిటి నొప్పులు కోసం ఎదురు చూడడమే పని-అనుకుంటూ లీవు సాంక్షన్ చేయించుకుని ఇంటికి వచ్చింది.

సుమతి అక్కగారు యింట్లోనే వుంటుందని సంతోషపడ్డట్టున్నా-సుందరం బోనులో పడ్డ ఎలుకలాగా గింజుకోవడం ప్రారంభించాడు.

"ఎందుకేనా మంచిది రెండు రోజులు ముందరే ఆస్పత్రిలో చేరకూడదూ?" అడిగాడు.

"నెప్పులు యిలా రావడం అలా కనడం జరగదండీ. ప్రారంభం అయ్యాకే నా వెళ్ళొచ్చు" అంది- పేలవంగా నవ్వుతూ.

కూర్చోపెట్టి అక్కగారికి అన్నం పెట్టింది సుమతి. సుందరం ఆ రాత్రానికి తగ్గటే సెలవు తీసుకున్న మర్నాడే రాత్రికి నొప్పులు ప్రారంభమయ్యాయి సుగుణకి. హుషారుగా ఆస్పత్రిలో దింపి "సుమతిని వుండమంటావా" అడిగాడు.

"అక్కర్లేదు. ఎవరేనా ఉదయం వస్తే చాలు" అంది అక్కడి నర్సు.

'ఉదయందాకా ఈ యాతనకు ముగింపు వుందా!' అనుకుని కళ్ళు మూసుకుంది సుగుణ.

భర్తా చెల్లెలు ఉత్సాహంగా నడవడం చూసింది. చెల్లెలి కాళ్ళు నేల మీద ఆనడంలేదు. ఆ వయసు అలాంటిది అనుకుంది. సుందరం కూడా కొత్త చలాకీతనంతో వుండడం సుగుణ గమనించకపోలేదు. 'తండ్రికాబోతున్నానన్న గర్వమే గాని భార్య ఎంత కష్టపడుతోందన్న సానుభూతి లేదు' అనుకుంది.

మొదటికాన్పేమో- సుగుణ చాలా కష్టపడింది. అబ్బాయి పుట్టాడు.

ఉదయాన్నే చూడవచ్చిన సుందరం గర్వంతో కాలరు ఎగరేశాడు అబ్బాయిపుట్టినందుకు. అచ్చం బావలాఅందంగా వుంటాడక్కా అని మురిసిపోయింది సుమతి.

ఆరోరోజు యింటికి పంపేశారు. సుగుణ ఒంటరిగా వెళ్ళి ఒడిలో బిడ్డతో యింట్లో అడుగు పెట్టింది. బాలింతగా మంచంపై కూర్చునే వాతావరణంలో ఏదో తెలియని మార్పు వచ్చిందని గ్రహించింది సుగుణ. తను పడుకుందన్నప్పుడు బావామరదళ్ళు ఒకటే గుసగుసలు మెలుకువగా వుందని తెలిసినప్పుడు బావామరదళ్ళ వేళాకోళాలు.

ఆ రోజు ఉదయాన్నే సుమతి తలతిరిగి దోక్కోవడం చూసింది. భర్త అది చూసి-వీధిలోకి జారుకోవడం చూసింది- సుగుణ.

"సుమతీ యిలారా" అని మంచం మీద నుంచే కేక వేసింది.

"ఏం అక్కా" అంటూ సుగుణ పట్టిన చెమటలు తుడుచుకుంటూ వచ్చి దగ్గిరగా నిలబడింది. కొద్ది క్షణాలపాటు చెలెల్లి ముఖంలోకి తీక్షణంగా చూసింది సుగుణ.

ఆ చూపుల ముందు కళ్ళు వాల్చేసింది సుమతి.

"ఏమైంది చెప్పు?" చాలా తీక్షణంగా అడిగింది

కళ్ళ వెంట జలజల నీరు కారడం ప్రారంభం అయింది సుమతికి.

"తరవాత యిద్దరం కలిసి ఏడుద్దాం— ముందు చెప్పు...."

"అక్కా.... బావ.... నేను...." అంతే. సుమతి చెంప ఛెళ్ళుమంది.

"ఏమే పాపిష్టిదానా. నాన్నమీద భారం వేయకూడదని – నేను యిక్కడికి నిన్ను రప్పించుకున్నాను. నువ్వేం చేశావు? నేను



నాన్నకి ముఖం ఎలా చూపెట్టను?" వస్తూన్న దుఃఖాన్ని ఆపుకొంటూ అడిగింది సుగుణ.

సుమతి వంచిన తల ఎత్తలేదు.

ఆ రోజంతా ఆలోచించింది సుగుణ. తండ్రికి ఏమని చెప్పాలి? దానిగతి యింకేమిటి? తన గతేమిటి? యీ పుట్టిన నలుసు గతేమిటి? ఏవేవో ఆలోచనలు. రాత్రి కూడా నిద్రపట్టలేదు సుగుణకి.

తెల్లవారి లేస్తూనే తలంటి స్నానం చేసింది సుమతిని కూడా చేయమంది. భర్తను లేపి త్వరగా స్నానం చేయమంది. సుందరానికీ హడావిడి దేనికో తెలియలేదు.

"ఏమిటీ రోజు? ఏదైనా విశేషమా?" అడిగాడు భారని.

"విశేషమే " అంది.

దేవుని పటంముందు నిలబెట్టింది-భర్తనీ-సుమతినీ.

"ఏమిటీ పిచ్చివేషాలు?" విసుక్కున్నాడు సుందరం.

"పిచ్చివేషాలు వేసింది మీరు. ముందీ వసుపు కొమ్ము దాని మెళ్ళో కట్టండి" అంది-పసుపుతాడు అతని చేతిలో బలవంతాన పెడుతూ.

"నీకేమైనా మతి పోయిందా?" కసిరాడు.

"పోలేదు. వచ్చింది.... ఇది మీ బిడ్డకి తల్లి కాబోతోంది. దానికి పెళ్ళి కాలేదు తెలుసా?.... ఎందుకు దానితో ఆడుకున్నారు? మీకు పెళ్ళయింది. మగాడివని నిరూపించుతూ కొడుకు పుట్టాడు. యీపని ఎలా చేయగలిగావు? నాకు సాయం చేయడానికి పంపితే దాన్ని తల్లిని చేశావే! మా నాన్నకేం చెప్పను? .. కట్టు. అప్పుడు చెప్తాను- నాన్నా నా మొగుడే నీ చిన్న కూతుర్ని చేసుకున్నాడని" ఆవేశంతో ఊగిపోతూంది సుగుణ.

"సుగుణా" ఏదో చెప్పబోయాడు సుందరం "షటప్. ముందాతాడు కట్టి తరువాత ఏమైనా చెప్పు" అరిచింది.

మారు మాట్లాడకుండా సుమతి మెడలో పసుపుతాడు కట్టేశాడు సుందరం.

"ఇప్పుడు చెప్తున్నా విను- ఇద్దరూ బయటికి పోండి. ఒక్క క్షణం ఇక్కడ వుండడానికి వీల్లేదు" గద్దించింది.

"అక్కా...."

"అలాపిలవకు చెల్లెల్నైనా సరే-సవితిగా వుంచుకోవలసిన గతి నాకు పట్టలేదు. మీ బ్రతుకు మీరు బ్రతకండి. నా బ్రతుకు నేను బ్రతుకుతాను" అంది.

"సుగుణా క్షమించు. పొరపాటే. కాని ఇద్దర్నీ...."

"ఏడిశావు! ఇద్దర్నేం కర్మ-పదిమందినేనా ఏలుతావు-నీతిలేనివాడివి నువ్వు. కాని నాకు నీతి వుంది. బాధ్యతలు గుర్తించగల మనసుంది.. వెళ్లు- పెళ్ళాన్ని-సంపాదించి-పోషించు. అదీ చూస్తాను........ వెళ్ళు. సుమతీ- పెట్టి సర్దుకో."

"సుగుణా. యిలా వున్నపళంగా ఎక్కడికి తీసుకు వెళ్ళను?"

"నీ యిష్టం వచ్చిన చోటికి తీసుకెళ్ళు. నేను అద్దెయిస్తున్న ఈ యింట్లో వుండడానికి వీల్లేదు."

"మీ నాన్న....

"ఆయనకి నే చెప్తాను. నేనే ఈ పెళ్ళి చేశానని."

"ఆయన ఒప్పుకుంటే .... నువ్వూ.... నేనూ...." నసిగాడు.

"ఛస్తే నీతో కాపురం చేయను. నీకు అందమైన ముఖం వుందేగాని అందమైన మనసు లేదు నైతికవిలువ లేని నీ అందం నా కసహ్యంగాకనబడుతోంది...." అంటూ గబగబ వెళ్ళి తన గదిలో మంచంపై వాలిపోయింది సుగుణ. ఆమె ఏడవడం లేదు.

తండ్రికెలా చెప్పాలా అని ఆలోచిస్తోంది. పసివాడి ఏడుపు కూడా ఆమె ఆలోచనలను ఛేదించి- ఆమె గుండెని తట్టలేకపోతూంది.


# రోజంతా తుమ్ముతూ గడపకండి



జలుబు వల్ల ఒక మంచి రోజును పాడవనివ్వకండి. ముక్కు కారడం, ఛాతీలో కఫం మరియు తలభారం. ఇవన్నీ జలుబు లక్షణాలు. మీరు బాధపడుతారు. ఒక మంచి రోజు పాడవుతుంది. మరి అలాంటప్పుడు తెలివైన పని ఎందుకు చేయకూడదు? కోల్డరిన్ వాడి చూడండి. ఇది ప్రత్యేకంగా తయారు చేయబడిన జలుబు బిళ్ల. ఎంతో అనుకూలమైనది. ఎంతో ఉపశమనం ఇస్తుంది.




జలుబుతో బాధ పడటం ఎందుకూ?
కోల్డరిన్ తీసుకోకూడదూ?

CASBC-111-124 TEL